కథానిక — కె. సదాశివరావు

కెప్టెన్ మిర్దాన్ లంచ్ తినడం పూర్తి చేయబోతున్నాడు. చివరన ఓ గ్లాస్ ప్లియాడియన్ లిక్కర్‌తో గొంతు తడుపుకున్నాడు. ఆ మద్యం రుచిగా, ఘాటుగా ఉంది. శరీరంలోని నరాలకి మంచి ఊపు నిచ్చి నాడీ మండలాన్ని సన్నగా కుదిపేలా....ఓ చిరు కీలలా అది కంఠంలో నుండి దిగినప్పుడు ఆహ్లాదకరమైన అనుభవం నరనరానికీ పాకింది. హాయిగా ఫీలయ్యాడు కెప్టెన్. ప్లియాడిస్ నక్షత్ర మండలం మంచి మంచి పానీయాలకి, రుచికరమైన ఆహారాలకి ప్రసిద్ధి. అంత అద్భుతమైన వెరైటీ ఈ గాలక్సీలో మరో చోట లభించవని ప్రతీతి. అరుదైన, అతి ఖరీదైన, మనసైన భోజనం శరీరంలో పడిన తర్వాత కెప్టెన్ అర్ధనిమీలిత నేత్రాలతో స్టార్ స్క్రీన్ కేసి చూశాడు. అందులో తెలిసిన విశ్వం - నోన్ యూనివర్స్ - కనిపిస్తున్నది. అతడిలో తృప్తి. ఇంతలో ఓ రోబో ఛాంబర్ లోనికి వచ్చి చెప్పింది. దాని పేరు 'స్నేహ'. మోడల్ నంబర్ 9. ''కెప్టెన్, ఓ విచిత్రమైన వ్యక్తి, మిమ్మల్ని చూస్తానంటున్నాడు.''

''విచిత్రమైన వ్యక్తి అంటే నీ ఉద్దేశం ఏమిటి స్నేహా? మనకు తెలిసిన విశ్వంలో చిత్రాలకీ, విచిత్రాలకీ ఆస్కారం లేదని నీకు తెలును. ఇలాంటి భావాలకి మనం అతీతులమని నీవు మరిచిపోయావా?''

''నా ఉద్దేశం అది కాదు కెప్టెన్. ఈ వ్యక్తి రూపురేఖల్లో విచిత్ర వైఖరి లేదు. అతడు ఉన్న ప్రదేశం, అతడు చెబుతున్న మాటలు విచిత్రంగా ఉన్నాయి అనే నా అభిప్రాయం. అతడి కోరిక ఇంకా విచిత్రంగా ఉంది.'' కెప్టెన్ చిరునవ్వు నవ్వాడు. ఈ మెషిన్లు గాలక్సీలోని జ్ఞాన జీవుల సహనాన్ని పరీక్షిస్తాయి. ఎప్పుడూ లాజిక్‌తో వాదించి నానా బాధ పెడతాయి.

''సరే స్నేహా. ఏమిటా విచిత్ర వైఖరి? నీవంత ప్రత్యేకంగా చెబుతున్నావు?''

''నీ కళ్ళతో చూడడం మంచిదేమో కెప్టెన్. అప్పుడు నీకే అర్థమవుతుంది.'' కెప్టెన్ సిగార్ వెలిగించాడు. ఈ చుట్టలోని ఆకు పొగాకు కాదు. అరాకిస్ గ్రహంమీద పెరిగే ఓ ప్రత్యేక మూలికా వృక్షానికి సంబంధించిన ఆకు. దాని



చిత్రాలు : గోపీ

# మానవ ఫ్యాక్టర్



**సైన్స్ కథలు రచించే బహు కొద్ది మంది తెలుగు రచయితలలో కె. సదాశివరావు ఒకరు. ఈ కథలు ఆయనకు అనన్యమైన కీర్తిప్రతిష్ఠలు ఆర్జించిపెట్టాయి.**

పేరు డెరాంజ్. అది హెర్బ్. ఈ ఆకు కాలిస్తే మానసిక ఉల్లాసంతో పాటు బ్రెయిన్ కణాలు, న్యూరాన్‌లు శక్తిమంతంగా పనిచేస్తాయి.అదీ కాకుండా ఈ పొగ కాల్చడం మానలేని అలవాటుగా మారే అవకాశం లేదని సాంకేతిక పరంగా రుజువయింది. ఎప్పుడు కావాలన్నా మానేయవచ్చు. శరీరంలో జీవకణాల మీదా, ఊపిరితిత్తులలో, కంఠంలో ఏ విధమైన చెడు ప్రభావాలూ ఉండవు. సిగార్ కాలుస్తూ కెప్టెన్ ఎదురు చూశాడు అర్ధ నిమీలిత నేత్రాలతో.

బయట అన్ని దిక్కులా విస్తరించిన అనంత రోదసీ రాత్రి.

మానవులు మద్యాలనీ, ఇతర వస్తువులనీ ఎందుకు వాడతారు? దానికీ ఏదో బలీయమైన కారణం ఉండి ఉండాలి. ఏమిటది? జీవులకి రియాలిటీని భరించే శక్తి లేకా? భౌతిక ప్రపంచంలోని నిర్బంధాలనుండీ, బాధలనుండీ, టెన్షన్స్ నుండీ, ఆటుపోటులనుండీ పారిపోవాలి. ఈ డ్రగ్స్ సృష్టించే మనో ప్రపంచంలో వారికి సెక్యూరిటీ లభించినట్లుగా తాత్కాలికమైన భ్రమ కలుగుతుంది. ఈ భ్రమ ఎల్లకాలమూ కావాలంటే, ఆ ఎస్కేప్ పర్మనెంటుగా అవాలంటే ఎడిక్షన్...ఆల్కహాలిజమ్...ఇవే మార్గాలు. అందువల్లనే జీవులు వీటి మీద ఆధారపడి ఆరోగ్యాలనీ, జీవితాలనీ డ్రగ్స్ సృష్టించే ప్రత్యేక లోకంలో విహరించే ప్రయత్నాలలో నాశనం చేసుకున్న ఉదాహరణలు కోట్లాది. అన్ని జీవుల్లోనూ, జాతుల్లోనూ, యుగాల్లోనూ ఉన్నాయి. ముందు ముందు కూడా ఉంటాయి.

కొంత మంది కళాదృష్టి కల జీవులకు సాధారణ జీవితం డ్రాబ్. వీరికి మాజికల్ రియాలిటీ కావాలి. స్వప్నాలలో దొరికే వాస్తవాలకోసం వెదుకుతూ తమ మానసిక ప్రపంచాల్లోని మేజిక్‌ని వారు తమ కళలోనికి అనువదించి, కళాసృష్టి చేసి మాస్టర్‌పీసెస్‌ని సృష్టించారు. ఏది ఏమైనా జీవులున్నంత కాలం ఏదో విధమైన ఎస్కేప్స్ ఉంటాయి అనుకున్నాడు కెప్టెన్.

స్పేస్‌షిప్ ''మహావిశ్వ'' లెడా (హంస) మండలంలోని ఓ చిన్న గ్రహం మీద ఆగి ఉంది.అక్కడ అరుదైన లోహపు గనులున్నాయి. ''మహావిశ్వ'' ఖనిజాలను, ఇతర గ్రహాలకు మోసుకుపోయే పెద్ద కార్గో షిప్.

ఓ పది మిలియన్ టన్నుల ఖనిజాన్ని అవలీలగా రోబో గాంగ్స్‌తో త్రవ్వించి, లోడ్ చేయించి ఇక్కడ నుండి వెళ్ళిపోవాలి మరో రెండు రోజులలో.

షిప్ డోర్ హిస్ మంటూ మెల్లగా తెరుచుకుంది. బాగా వయసు మీరిన వ్యక్తి పొడుగాటి తెల్లని గడ్డంతో, బుజాలను దాటి పెరిగిన జుట్టుతో, గుబురుగా పెరిగిన కనుబొమలతో, వాటి క్రింద తీక్ష్ణంగా చూస్తున్న నల్లటి కళ్ళతో, పచ్చటి రంగుతో ఉన్న ఓ భారీ మనిషి ప్రవేశించాడు. అతడి చర్మం ఏనుగు దంతంలా మెరుస్తోంది. అతడి కళ్లలో ఏదో విచిత్రమైన వెలుగు ఉంది.

''ఎవరు మీరు?'' అడిగాడు కెప్టెన్ మిర్దాన్.

''నా పేరు విశ్వాస్. డాక్టర్ విశ్వాస్. నేను భూ గ్రహ వాసిని. నేను అక్కడే పుట్టాను.'' అతడి కంఠంలో గాంభీర్యం ఉంది. లలితంగా మిళితమైన మార్దవం ఉంది. చెప్పరాని సంస్కారం ఉంది.

''భూమి మీద పుట్టారా?'' కెప్టెన్ మిర్దాన్ షాక్ తిన్నాడు.


భూమి? ఎక్కడుంది భూమి? గాలక్సీలో ఓ లెజెండ్ ప్రచారంలో ఉంది. మానవ జాతి పుట్టింది భూగ్రహం మీదననీ... అది ఓ సామాన్య నక్షత్ర గ్రహ కూటమికి చెందినదనీ. అయితే, ఇదంతా కట్టు కథ అని మరికొందరు స్కాలర్స్ వాదించేవారు. వారి వాదన ప్రకారం రోదసీ యుగ మానవుడు ఆల్ఫా సెంటార్ నుండి విశ్వం లోనికి ప్రయాణం సాగించాడనీ, మిగిలినవన్నీ కల్పిత గాథలు, పుక్కిటి పురాణాలు అనీ కొట్టి పారేశారు. వారి వాదనలోని ముఖ్యమైన అంశం ఓ సామాన్య నక్షత్రానికి దగ్గరలో ఉండే గ్రహం నుండి అంత ప్రతిభావంతులైన మానవులు రావడం అసాధ్యమని.

కానీ, కొందరి దృష్టిలో భూమి విశ్వ పురాణాల్లో... కథల్లో... ఇతిహాసాల్లో భాగం. అది మానవ జాతికి తల్లి! ద్విపాద పశువైన మానవుడు అక్కడే పుట్టి, పరిణమించి తన బాధ్యతనీ, భూమికనీ తెలుసుకుని ప్రకృతి నిర్దేశం ప్రకారం, తన జాతి నిర్ణయాన్ని అనుసరించి రోదసీ పుత్రునిగా, గాలక్టిక్ పౌరుడిగా మారిపోయాడు. తన పుట్టుకలోని రహస్యాన్నీ, పరమార్థాన్నీ తెలుసుకుని జ్ఞాన జీవిగా, సామరస్యం నిండిన గాలక్టిక్ జీవిగా బ్రతుకుతున్నాడు.

ఇదంతా జరగడానికి ఎన్నో వందల, వేల ఏళ్ళు పట్టింది. చివరికి మానవ చరిత్ర గాలక్టిక్ చరిత్రలో కలిసిపోయి తన ప్రత్యేకతని కోల్పోయింది. ఓ చిన్న అధ్యాయంగా, చివరికి ఫుట్ నోట్‌గా మారిపోయింది. గాలక్సీలోని అన్ని జాతుల చరిత్రలు కలిసి నామరూపాలు లేకుండాపోయి - అన్నీ కలిసిన గాలక్టిక్ మహా చరిత్ర ప్రాచుర్యం లోనికి వచ్చింది.

ఇది బృహత్కథ: మహోన్నతమైన ఎపిక్! సాగా!

కానీ, కాలానికి ఓ భయంకరమైన శక్తి ఉంది. ఆ శక్తితో కాలం నిజాన్నీ, అబద్ధాన్నీ కథనీ, చరిత్రనీ, ఊహాలనీ, పుకార్లనీ అన్నింటినీ కలిపి కలగా పులగంగా కలిపేసి బుల్‌డోజ్ చేసి, కాలావసరాన్ని బట్టి, వ్యక్తి స్వార్థానికి



**ఇద్దరూ కరచాలనం చేశారు. నిర్ణీతమైన సమయాన షిప్ ప్రయాణం మొదలయింది. అంతా భూమిని వెదకడంలో మునిగిపోయారు.**

నరిపడేలా, సామాజిక న్యాయాలకి తలవంచి అన్నీ కలిపేసి... ఊహాలలోని మహత్తరమైన రహస్య ఇంధనాన్ని జోడించి చివరికి గుర్తించ వీలుకాని.. ప్రారంభ దశకు ఏమాత్రం సంబంధంలేని ఇతిహాసంగా, పుక్కిటి పురాణంగా, ఒకసారి అతిశయోక్తులు నిండిన అప్సర్డ్ నాన్సెన్స్‌గా మార్చేస్తుంది. ఈ గాథలు కాలం జరిగిన కొద్దీ చిలవలు వలవలతో, ప్రక్షిప్తాలతో, ఎవరికి తోచినట్లు వారు జోడించిన అన్వయాలతో పెరిగిపోతాయి. సామాజిక అవసరాలను బట్టి, చారిత్రక కారణాలకు అనుగుణంగా, పటిష్ఠమైన సామూహిక జాతి అంతఃకరణకు అనుకూలంగా మార్పు చెంది అవి ఆయా సంస్కృతులలో భాగాలైపోతాయి. అది మంచికో, చెడుకో ఎవరికీ తెలియదు. ఇలా జరగడానికి ఎన్నో కారణాలున్నాయి. అందులో ముఖ్యమైనవి వ్యక్తి స్వార్థాలు. వర్గ స్వార్థాలు, అవసరాలు, జాతి వైషమ్యాలు, వైరుధ్యాలు. అన్నింటినీ మించినది హేతురాహిత్యం.

జీవ చరిత్రకు ఉన్న అవసరాలని మరచిపోయిన జాతులు కేవలం వర్తమానానికి ప్రాముఖ్యమిచ్చి, భూతకాలాన్ని పూర్తిగా మరిచిపోయి, భవిష్యత్తుకు కావలసిన యోచన లేకుండా కాలాన్ని వృథా చేసుకునేవి.

ఈ సంస్కృతులకు భవిష్యత్తు ఉండదు. అవి అవసానదశకు చేరి కొన ప్రాణంతో చావుబ్రతుకుల మధ్య ఊగిసలాడుతూ ఉంటాయి. ఇలాంటి గాలక్సీలో ఎన్నెన్ని ఉన్నాయో! అసంఖ్యాకం అవి. వాటి గతి అంతే. భూమి విషయంలోనూ ఇంతే జరిగి ఉండాలి.

కెప్టెన్ మిర్దాన్ భూమి పుత్రుల సంతతి వాడు. అతని పూర్వీకులు భూమి మీదే పుట్టారని ఓ కథ వాడుకలో ఉంది. ఎన్నో తరాల నాడు జరిగిన ఓ సంఘటనని వారు అప్పుడప్పుడూ తలుచుకుంటూ ఉంటారు.

ఇప్పుడు వారందరూ వేరే గ్రహాలలో, వేరే నక్షత్ర మండలాలలో సెటిలయిపోయారు. గ్రేట్ స్పేస్! ఆ రోజులనుండి ఎంతదూరం వచ్చాము అనుకున్నాడు కెప్టెన్ విస్మయంతో.

ఆ రోజులు నిజంగా ఉండేవా? ఆలోచనలను భగ్నం చేస్తూ అన్నాడు.

"అవును కెప్టెన్. నేను భూమి మీదనే పుట్టాను. అది జరిగింది నాలుగువందల ఏభై ఏళ్ళనాడు. నేను చెబుతున్నది నీవు నమ్ముతావా కెప్టెన్?"

మిర్దాన్ నిర్ఘాంత పోయాడు. స్నేహ చెప్పింది నిజమే. విచిత్రమైన ఉదంతమిది.

దీర్ఘ జీవనకాలం ఈ రోజుల్లో సామాన్యమే. వంద, రెండు వందల ఏళ్ళు సాధారణం. ఈ రోజుల్లో గాలక్సీలోని ఎందరో జీవులు సుదీర్ఘమైన జీవనకాలాలతో ఉంటారు. గాలక్సీ మధ్యభాగంలో ఉండే జీవులు నమ్మశక్యం కాని ఏళ్లు బ్రతుకుతారు. మానవ ప్రమాణాలకు ఏమాత్రం సంబంధం లేని ఆశ్చర్యకరమైన జీవన విధానాలు సామాన్యం ఇక్కడ. కానీ, మానవుడు ఇన్నేళ్లు జీవించడమా?

"గ్రేట్ స్పేస్! డాక్టర్, మీరు కూర్చోండి. స్నేహా! డాక్టర్ విశ్వాస్‌కి ఏమైనా తినడానికి తెస్తావా?"

డాక్టర్ విశ్వాస్ ఏవిధమైన షేప్ లేని ఓ కుర్చీలో కూర్చున్నాడు.

స్నేహ బయటకు వెళ్ళింది. మిర్దాన్‌కి డాక్టర్ విశ్వాస విగ్రహాన్ని చూస్తే ఏదో చెప్పరాని అనుభూతి కలిగింది. గౌరవం, ఆదరం, ఆరాధన. ఆ వ్యక్తిలో ఏదో ప్రత్యేకత ఉంది. ఏమిటది? వాట్ ఇన్ స్పేస్ ఈజ్ దట్? ఋగ్వేద కాలపు ఋషిగా, జ్ఞానిలా, ఓల్డ్ టెస్టమెంట్‌లోని ప్రాఫెట్‌లా, మత ప్రవక్తలా, మహాత్ముడిలా, విజ్ఞానం, సౌశీల్యం, సమదృష్టి, జ్ఞానం మూర్తీభవించిన మహా పురుషుడిలా ఉన్నాడు డాక్టర్ విశ్వాస్. మానవత్వంలోని మహోన్నత విలువలు మూర్తీభవించిన అసాధారణ వ్యక్తిలా ఉన్నాడు.

"కెప్టెన్, నాతో పాటు నా పెర్సనల్ రోబో సేవా బయట ఉంది. మీకు అభ్యంతరం లేకపోతే లోపలికి పిలుస్తాను."

"తప్పకుండా డాక్టర్ విశ్వాస్."

"సేవా" అని అరిచాడు డాక్టర్ విశ్వాస్. అతడి కంఠస్వరం తీవ్రతకి స్పేస్ షిప్‌లో శబ్ద ప్రకంపనాలు పుట్టాయి.

చాలా పురాతనకాలపు రోబో గదిలోనికి ప్రవేశించింది. మెల్లగా నడిచి వెళ్లి డాక్టర్ విశ్వాస్ వెనక నిలబడింది. రోబోటిక్స్ ప్రారంభ దశలో తయారుచేసిన మెషిన్ అది. క్రూడ్‌గా... మ్యూజియంలలో ఉండే పాత రోబోలా, వింటేజ్, క్లాసిక్ పీస్ ఆఫ్ మెషినరీ అది. అయినా, ఇంకా బాగానే పనిచేస్తున్నది.

మొదట్లో తయారుచేసినవి కాలిక్యులేటర్లు. ఆపైన కంప్యూటర్స్. తర్వాత సూపర్ కంప్యూటర్స్. కంప్యుటేషన్ ఎబిలిటీ పెరిగి టెరా ఫ్లాప్ లెవెల్‌కి చేరాక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మీద పరిశోధనలు ఉధృతం చేశారు.

ఇదే దశలో ఐజాక్ ఆసిమోఫ్ తన మూడు రోబోటిక్స్ న్యాయాలు ప్రతిపాదించాడు. వాటిని పొందుపరచి సైబర్నెటిక్స్‌లో విప్లవం వచ్చింది.

రోబో తరాలు మారిపోయాయి. 'స్నేహ' మోడల్ రోబోలకి ముందు ఎన్నో మోడల్స్ వచ్చాయి. మిత్ర, సేవా - ఇవన్నీ పాతవి.

స్నేహ ఓ ప్లేట్‌లో తినడానికి ఏదో పట్టుకొచ్చింది. గ్లాసులో ఫ్రూట్ జ్యూస్ ఉంది. అవి డాక్టర్ విశ్వాస్‌కి సర్వ్ చేశాక సేవా మోడల్ రోబోని ఓవర్‌హాల్‌కి మెయింటెనెన్స్ వింగ్ లోనికి తీసుకెళ్ళింది. భోజనం పూర్తయి కాసేపు కబుర్లు చెప్పుకునేసరికి ఓవర్‌హాల్ పూర్తి చేసుకుని సేవా తిరిగి వచ్చి నిలబడింది.

"డాక్టర్, ఇప్పుడు చెప్పండి. నేను మీకు ఏ విధంగా సాయం చేయగలను?"

ఒ కొద్ది క్షణాల పాజ్. "కెప్టెన్, మీరు నన్ను భూమికి తీసుకొని వెళ్ళాలి." ఆ మాటలను కెప్టెన్ నమ్మలేకపోయాడు. తన చెవులేమన్నా ట్రిక్కు చేస్తున్నాయా?

"భూమికి తీసుకెళ్ళడమా? యూ మస్ట్ బి క్రేజీ డాక్టర్! గత ఎన్నో వందల ఏళ్ళుగా భూమిని ఎవరూ చూడలేదు. అది ఎక్కడుందో ఎవరికీ తెలియదు. చాలా మంది దృష్టిలో భూమి ఓ కట్టు కథ... మిత్... ఆ పేరు గల గ్రహం ఎన్నడూ లేదని, మానవజాతి ఆరంభం ఆల్ఫా సెంటార్‌లో నన్నది ఇప్పుడు ఎక్కువమంది నమ్మే సిద్ధాంతం. నా మట్టుకు నేను భూమి ఉన్నదని నమ్మను."

"లేదు కెప్టెన్. మీరు నమ్మాలి. నేను నిజానికి భూమిమీదనే పుట్టాను."

"భూమి మీద పుట్టారా?" నిర్ఘాంతపోయాడు కెప్టెన్.

"అవును." డాక్టర్ విశ్వాస్ కంఠంలో ఆశలు నిండిన ఏదో కోరిక పండిన, చిగురులు తొడిగిన అనుభూతి గోచరించింది.

కెప్టెన్ ఆలోచనలో పడ్డాడు. బహుశా ఆ గ్రహం ఒకవేళ ఎక్కడేనా ఉందేమో! ఈ విశాలమైన కోటానుకోట్ల నక్షత్ర సముదాయాలతో విలసిల్లిన ఈ గాలక్సీలో ఏదైనా మారుమూల తారామండలంలో దాగి ఉందేమో!

కానీ, ఇంత పెద్ద గాలక్సీలో ఎక్కడ? స్పేస్ పోర్ట్ బయట విజి స్క్రీన్‌లో ప్రతిఫలిస్తూ మహావిశ్వం విస్తరించుకుని ఉన్నది. అది ఏ జీవి ఊహకూ అందకుండా, మహోన్నతంగా, మిస్టీరియస్‌గా, వైభవంగా అన్ని దిక్కుల్లోనూ, అన్ని డైమెన్షన్లలోనూ పరచుకుని అనంతం వేపు సాగిపోయి ఉంది.

"అవును కెప్టెన్. నేను భూమి మీద పుట్టి పెరిగాను. ఆ రోజుల్లో అక్కడ అందమైన సముద్రాలు... ఖండాలు... మంచు కప్పిన పర్వత శ్రేణులు, జలపాతాలు, అడవులు, జంతువులు... ఎన్నో జాతుల మానవులు ఉండేవారు. ఈ లోకంలోని అతి సుందరమైన ప్రదేశాలలో అది ఒకటి. నేను ఎన్నో గ్రహాలలో పర్యటించాను. కానీ, ఏ గ్రహమూ భూమికి సరికాదు. మదర్ ఎర్త్! గుడ్ ఎర్త్!

"కెప్టెన్, నేను సైంటిస్ట్‌ని. గణితం నా ప్రధానాంశం. మానవులు స్పేస్ ఏజ్‌లో అడుగు పెట్టడానికి కారణమైన సైంటిస్టులలో నేనూ ఒకడినని గర్వంతో చెప్పగలను కెప్టెన్. నేను కనిపెట్టిన సూత్రాలు మొదటి స్పేస్ షిప్ డిజైన్లలో వాడడం జరిగింది. స్పేస్‌కీ, టైమ్‌కీ ఉన్న సంబంధాన్ని మా తరం శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. స్పేస్ ఏజ్ ఇంధనాలకి, ఎనర్జీ, జెనరేటింగ్ యూనిట్స్ నిర్మించడానికి నా ఈక్వేషన్స్ దోహదం చేశాయి. ఈ మహా విశ్వమంతా జీవుల కోసం ఏదో తెలియని శక్తి నిర్మించిన కేళీమందిరమని నమ్మే వారిలో నేను ప్రథముణ్ణి" అని ఆగాడు. ఆగి డాక్టర్ విశ్వాస్ నిట్టూర్చాడు.

"డాక్టర్, మీరు ఇక్కడికి ఎలా వచ్చారు? ఈ గ్రహంలో మీరు ఏం చేస్తున్నారు? నాకు ఏమీ అర్థం కావడం లేదు. గాలక్టిక్ సెంటర్‌కి ఎన్నో కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఈ మారుమూల గ్రహంలో ఉండడానికి కారణం ఏమిటి?"

"ఆ కథ చెప్పాలంటే చాలా సమయం తీసుకుంటుంది కెప్టెన్. నా నూటపదిహేడవ జన్మదినోత్సవం నాడు నేను రోదసీ యాత్ర ప్రారంభించాను. నాతో పాటు సేవా- నా పెర్సనల్ రోబో సర్వెంట్ వచ్చింది. తెలిసిన రోదసీ ప్రాంతాలలో

అన్ని దిశలా ప్రయాణం చేసి చూశాము. ఓ పందేళ్ళ తిరుగుడు పూర్తయాక నేనీ గ్రహానికి వచ్చి ఇక్కడ ఉండిపోయాను."

"ఎన్నాళ్ళనాడు డాక్టర్?"

"రెండు వందల ఏభై ఏళ్ళ పైనే." ఇప్పుడు సమాధానం చెప్పింది సేవా.

"రెండు వందల యాభై ఏళ్ళా?" విస్మయంతో అన్నాడు కెప్టెన్.

"అవును, దాదాపు అంతే." "కారణం ఏమిటి?" "ఏదో జరిగింది కెప్టెన్." గంభీరమైన అతడి గొంతులో ఏదో పొర అడ్డు వచ్చింది. ఏదో కారణం వల్ల డాక్టర్ విశ్వాస్ ఎంబరాజ్ అయినట్లు ప్రవర్తించాడు.

తన పురాతన ఎలక్ట్రానిక్ కంఠంతో సేవా చెప్పింది. "కెప్టెన్, జరిగింది ఇది. డాక్టర్ భూమి మీద ఉన్నప్పుడు సైబర్నెటిక్ ఆపరేషన్ జరిగింది. ప్రకృతిసిద్ధమైన బ్రెయిన్ తీసేసి పాసిట్రానిక్ బ్రెయిన్ అమర్చడం జరిగింది. కొన్నాళ్ళు పర్యటన చేసి మేము ఈ గ్రహం మీదకు వచ్చిన కొద్ది రోజుల్లో పాసిట్రానిక్ సర్క్యూట్స్‌లో ఏధో ట్రబుల్ వచ్చి డాక్టర్ విశ్వాస్‌కి మతిమరుపు వచ్చింది. తనెవ్వరో, తానెక్కడున్నారో పూర్తిగా మరిచిపోయారు. ఇన్నేళ్ళుగా మేము ఇక్కడే ఉండిపోయాము. నేను ఆయనకు సేవ చేస్తూ ఉన్నాను. హఠాత్తుగా కొద్ది రోజుల క్రితం ఆయనకు మళ్ళీ జ్ఞాపక శక్తి తిరిగి వచ్చేసింది. మళ్ళీ డాక్టర్ విశ్వాస్ మన ప్రపంచానికి తిరిగి వచ్చాడు. జ్ఞాపకాలు తిరిగి పూర్తిగా వచ్చిన మరుక్షణం నుండే ఆయన ఒకటే మాట. తిరిగి భూమికి వెళ్ళిపోవాలని."

డాక్టర్ విశ్వాస్ అందుకున్నాడు.

"మమ్మల్ని ఇక్కడ నుండి తీసుకుపోయే స్పేస్ షిప్‌లు వస్తాయేమోనని మేము ఎదురు చూస్తున్నాము. ఓసారి కానస్ మేజర్ మండలపు జీవుల షిప్ వచ్చింది. కానీ, వారు పని పూర్తి అయిపోగానే వేరే డ్యూటీ ఉండడం వల్ల వేరే సిస్టంకి వెళ్ళిపోయారు."

కొద్ది క్షణాలు ఆగి తనలో తను మాట్లాడుకుంటున్నట్లుగా అన్నాడు. "ఎక్కడో భూమి క్షేమంగా ఉన్నదని నాకు తెలుసు. అక్కడికి నేను వెళ్ళి తీరాలి కెప్టెన్. అక్కడికి నన్ను తీసుకెళతారా కెప్టెన్? ప్లీజ్."

నమ్మశక్యం కాని కథ. రెండు వందల యాభై ఏళ్ళ మతిమరుపు! గ్రేట్ స్పేస్! ఈ మనిషి నిజంగా ఓ రెలిక్స్! హ్యూమన్ స్పెసిమన్. పురాతన మానవ జీవి. తనకి తెలియని కాలానికీ, లోకానికీ చెందినవాడు. పిటీ!

"డాక్టర్, నా బాధ్యతలు నాకు ఉన్నాయి. ఈ ఖనిజాన్ని తీసుకొని నేను మా నక్షత్ర మండలానికి వెళ్ళడం నా డ్యూటీ. ఆపైన నాకు వేరే పనులున్నాయి వ్యక్తిగతమైనవి... ఇంతకీ ఉన్నదో లేదో కూడా తెలియని ప్రదేశానికి... అదే భూమికి మిమ్మల్ని ఎలా తీసుకెళ్ళడం?"

"కెప్టెన్, నేనో ప్రతిపాదన చేస్తాను. నచ్చితే దాన్ని ఆచరణలో పెట్టండి. తర్వాత మీ ఇష్టం. మీ కాలం ఎంతో విలువైనదని నాకు తెలుసు. దాని వల్ల మీకు ఏ విధంగానూ నష్టం రాకుండా నేను మీకు డబ్బు ఇస్తాను. మీ స్పేస్ షిప్ నేను హైర్ చేస్తాను. నా దగ్గర డబ్బు ఉంది కెప్టెన్. చాలా... చాలా... డబ్బు ఉంది. నేను ఇక్కడికి వచ్చినప్పుడు తెచ్చిన ప్లాటినమ్ బాండ్స్‌ని గాలక్టిక్ కరెన్సీలోకి... అదే స్టెల్లార్స్‌కి మార్చి బ్యాంక్‌లో వేసింది సేవా. ఆ డబ్బు విపరీతంగా పెరిగిపోయింది. మీకు ఎంత కావాలో చెప్పండి... మీ స్పేస్ షిప్‌ని భూమికి తీసుకెళ్ళడానికి బాడుగగా ఎంత ఛార్జి అవుతుంది?"

కెప్టెన్ నవ్వాడు. డాక్టర్‌కి నిజంగానే పిచ్చెత్తింది. ఈ వెర్రి వాలకం డాక్టర్! ఈ చిత్రమైన కథ! వీటన్నిటినీ మించిన మాడ్‌నెస్. తన స్పేస్ షిప్‌ని బాడుగగా తీసుకోవడం ఈ వెర్రివాడితో కాలం వృథా. ఈ వ్యవహారం ఇంతటితో ముగించి ఎలాగో బయటపడి తన దారిన తాను వెళ్లిపోవాలి.

"మీ జీతం ఎంత కెప్టెన్?" అడిగాడు డాక్టర్ విశ్వాస్.

సరే, ఈ జోక్‌ని పంచ్‌లైన్ దాకా తీసుకెళదామని కెప్టెన్ అన్నాడు.

"నేను ట్రిప్‌కి పదివేల స్టెల్లార్స్ ఛార్జ్ చేస్తాను డాక్టర్. ఇంధనం ఖర్చులు కాకుండా.?"

"అలాగే కెప్టెన్. ఆలస్యం చేయవద్దు. నేను మీకు లక్ష స్టెల్లార్స్ ఇస్తాను. మీరు షిప్‌ని రెడీ చేయండి. మనం వెళ్ళి తీరాలి. కెప్టెన్."

లక్ష సెల్లార్స్! గ్రేట్ గాలక్సీ! ఈ గ్యాలక్సీలో ఓ చివరనుండి మరో చివరకు, మారుమూలలకు డైమెన్షన్ల బంధాల్ని చీల్చుకుని కాలప్రవాహపు విచిత్ర గతిలో .పి ట్రిప్‌లు వేస్తే లభించే జీతం ఒక్క ట్రిప్‌కే ఇస్తానంటున్నాడే పిచ్చి ..క్టర్. అంత డబ్బు ఇతగాడి దగ్గర ఎలా ఉంది? ఉందా అసలు?

సేవా నిశ్శబ్దంగా బయటకు పోయి ఓ పెట్టె పట్టుకొచ్చింది. ఆ పెట్టె చాలా తేలికగా ఉండే సింథటిక్ మెటీరియల్‌తో చేసింది. పెట్టె బరువుగా ఉన్నట్లు ఉంది. అది తెరిచింది సేవా. లోపల ఉన్న డబ్బు చూడగానే కెప్టెన్ కళ్ళు పెద్దవయ్యాయి ఆశ్చర్యంతో. పెట్టెనిండా దొంతర్లలో సర్దిన గాలక్టిక్ కరెన్సీ నోట్లు ఉన్నాయి. వాటిని తయారుచేసింది కాగితంతో కాదు. అది నక్షత్ర సముదాయంలో కెల్లా అత్యంత ఖరీదయిన, అరుదైన పదార్థం. అది యూనివర్సల్ కరెన్సీ. అంత డబ్బు కెప్టెన్ తన జన్మలో చూడలేదు.

"ఇదంతా మీదే కెప్టెన్?" మెల్లగా, శాంతంగా అన్నది విశ్వాస్ కంఠం.

ఈ డబ్బుతో ఇరవై ఏళ్లుగా తను పని చేయకుండా బ్రతకవచ్చు. భార్యా పిల్లలతో గాలక్సీలో విహరించి ఎంజాయ్ చేయవచ్చు. ఇప్పుడు డెలివరీ చేయవలసిన కార్గో రవాణా చేసేస్తే ఈ ఆఫర్ తీసుకోవచ్చు. ఆపైన ఎన్నో ఏళ్ల లీజర్! హాలిడే! కానీ, భూమి ఎక్కడుంది?

"కెప్టెన్, మనం టైమ్ స్పేస్‌లో ప్రవేశించాక నేను, నా రోబో కలిసి భూమిని లొకేట్ చేయడానికి ప్రయత్నం చేస్తాము. ఆ సమస్యను మీరు మాకు వది లేయండి. కానీ, మీరు మాకు చిన్న సాయం చేయాలి. ఓ స్టార్ మాప్, మరి కొన్ని పరికరాలు అవసరం ఉంటాయి. అవి మాకు ఇవ్వాలి. మరి నా ఆఫర్ మీరు ఆమోదించినట్లేనా కెప్టెన్!"

"ఎస్ డాక్టర్. నాకు మీరు ఆఫర్ చేసిన మొత్తం చాలా ఎక్కువ. నా మామూలు ఛార్జ్ ప్రకారం మిమ్మల్ని నేను భూమికి తీసుకెళ్తాను. ఇబ్బందిలో ఉన్న మిమ్మల్ని మోసగించడం నాకు ఇష్టం లేదు. కానీ, మీరు ముందుగా భూమిని కనుగొనాలి. అప్పుడు నేను మిమ్మల్ని అక్కడికి తీసుకెళతాను. ఒకవేళ భూమి దొరక్కపోతే మీకు నచ్చిన గ్రహం మీద మీరు దిగిపోవచ్చు. భూమి లాంటి గ్రహాలు ఇప్పుడు ఎన్నో ఉన్నాయి. మానవ స్థావరాలతో నిండి, దాదాపు భూమిలాంటి సంస్కృతీ శాఖలతో, వేషభాషలతో, కళలతో అభివృద్ధి చెందిన గ్రహాలు నాకు తెలిసినవి చాలా ఉన్నాయి డాక్టర్."

"నేను నమ్మను కెప్టెన్."

"క్షమ, క్షేమ, విధి, శక్తి, శాంతి వంటి గ్రహాల్లో విస్తృతమైన మానవ స్థావరాలున్నాయి. ఏలియన్స్ మించి ఎక్కువ మానవులే నివసిస్తున్న గ్రహాలివి."

"కెప్టెన్, భూమి లాంటి గ్రహం ఈ విశ్వంలో మరొకటి ఉండదు. నిజమైన వస్తువులకీ, నకిలీ వాటికీ ఉండే తేడా ఎప్పుడూ ఉంటుంది. అలాగే ఈ గ్రహాలు కూడా." నిట్టూర్చాడు డాక్టర్ విశ్వాస్.

కెప్టెన్ అనుకున్నాడు, వాదన వల్ల ప్రయోజనం లేదు ఈ మొండి డాక్టర్‌తో.

"మీరు నన్ను భూమికి తీసుకెళ్ళడం ముఖ్యం కెప్టెన్. నా పరిస్థితి మీకెలా అర్థమవుతుంది? ఎలా చెప్పడం? ఏం చెప్పినా మీకు తెలియకపోవచ్చు. ఈ పెట్టెలో లక్ష స్టెల్లార్స్ కన్నా ఎక్కువే ఉంది. అదంతా మీరు తీసుకోవచ్చు."

"నో - థాంక్యూ డాక్టర్. నేను మామూలు ఛార్జ్ చేసేది పదివేల స్టెల్లార్స్ మాత్రమే. అంతేకాకుండా మీ సాహచర్యంవల్ల ఈ డ్యూటీలో నాకు భూమిని దర్శించే అవకాశం లభిస్తుంది. అది ఎంతో విలువైనదిగా నేను భావిస్తాను."

ఇద్దరూ కరచాలనం చేశారు.

నిర్ణీతమైన సమయాన షిప్ ప్రయాణం మొదలయింది.

డాక్టర్ విశ్వాస్ అభ్యర్థన ప్రకారం ఓ స్టార్ మ్యాప్, ఓ స్కానర్, ఓ కంప్యూటర్ ఇచ్చింది స్నేహ. విశ్వాస్, రోబో, సేవా భూమిని వెదకడంలో మునిగి పోయారు.

షెడ్యూల్ ప్రకారం షిప్ హైపర్ స్పేస్‌లో ప్రవేశించి ప్రయాణం సాగించింది. అన్ని పానెల్స్, మీటర్స్ సరిగానే పనిచేస్తున్నాయని నిర్ధారణ చేసుకున్న తర్వాత కెప్టెన్ రిలాక్స్ అయ్యాడు. ప్రయాణం జరుగుతున్న సమయంలో డాక్టర్ విశ్వాస్ భూమి లొకేషన్ కనుగొనడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు.

షిప్ 'డోరాడో' సిస్టమ్ చేరింది. కార్గో అన్‌లోడ్ చేశాడు కెప్టెన్. మరో వారం

"గుడ్‌బై కెప్టెన్! మీకు నా ధన్యవాదాలు. ఆఁ- మరచి పోయాను. మీరు ఈ డబ్బంతా తీసుకెళ్ళాలి. ఇక్కడ డబ్బుకు అవసరం ఉండదు కెప్టెన్. ప్లీజ్!"



రోజుల సమయం కావాలని చెప్పాడు డాక్టర్ విశ్వాస్. కెప్టెన్ వారిని స్పేస్ పోర్టులో ఉన్న స్టేవెల్‌లో చెకిన్ చేసి ఓ వారం రోజుల్లో వస్తానని చెప్పి తన భార్యా పిల్లలూ ఉన్న గ్రహం 'క్షమ'కి వెళ్ళిపోయాడు.

ఎర్త్ లొకేషన్ అయిన వెంటనే విజికాల్ ద్వారా తెలియజేస్తే తిరిగి వచ్చేస్తానని చెప్పాడు. డాక్టర్ విశ్వాస్ ప్రయత్నాలు కొనసాగాయి. పరికరాలను వాడి, నిద్ర లేకుండా, పగలూ రాత్రీ అన్న భేదం లేకుండా కృషి సాగింది.

ఆరవ రోజున 'సోల్ నక్షత్రాన్ని' లొకేట్ చేయడంలో కృతకృత్యులయ్యారు. సోల్! సూర్య! సన్! సోలార్ సిస్టమ్! సూర్య మండలం! భూమి ఈ సిస్టమ్‌లోని నాలుగో గ్రహం. సోల్. మదర్ స్టార్ ఆఫ్ ప్లానెట్ ఎర్త్! ఆ నక్షత్ర గర్భం నుండి ఊడి పడిన ఓ చిన్న ముక్క భూమి.

చూస్తుంటే సోల్ సిస్టమ్‌లో ఏవేవో చిత్రమైన మార్పులు గోచరించాయి డాక్టర్ విశ్వాస్‌కి. కారణం అతడికి అర్థం కాలేదు. భూమి నీలిరంగు... ఆకు పచ్చరంగు కలయికగా కనిపించే గ్రహం. నీలి సముద్రాలు పరిచి ఉన్న భూతలం... ఆకుపచ్చ అడవులతో అలరారే ఖండాలు. ఏవో అనూహ్యమైన కారణాల వల్ల... ఏవో పెనుమార్పుల వల్ల ఈ రంగులు మారిపోయి ఉండాలి. బహుశా సూర్యకాంతిలో ఏదైనా మార్పు వచ్చిందా? తీక్షత ఏమైనా తగ్గిందా? లొకేషన్ పట్టుకోవడం ఎంతో కష్టసాధ్యమయింది. అయినా పట్టుదలతో, ఏకాగ్రతతో సాధించాడు డాక్టర్ విశ్వాస్. శాస్త్రీయ ప్రగతి ఒకసారి ఊహించలేని విధంగా మార్పులు తెచ్చి గుర్తు పట్టడానికి వీల్లేకుండా నగరాలనీ, దేశాలనీ... చివరికి గ్రహాలనీ కూడా మార్చేయడం. సహజం.

అనుకున్న విధంగా కెప్టెన్ తిరిగి వచ్చిన వెంటనే ప్రయాణం ప్రారంభ మయింది. ఏ అడ్డంకులూ లేకుండా వారు సూర్యమండలంలో... భూమి కక్ష్యలో ప్రవేశించిన తర్వాత భూమి ఇంకా స్పష్టంగా కనిపించింది. షిప్‌ని భూకక్ష్య ఆర్బిట్‌లో ఉంచి స్పేస్ కాబ్‌లో కెప్టెన్, డాక్టర్ విశ్వాస్, రెండు రోబోలూ భూమి మీద లాండ్ అవడానికి వెళ్ళారు. కనిపించిన దృశ్యం వారిని భయపెట్టింది. నిర్మానుష్యంగా... జీవరాసుల ఉనికి ఏమీ లేకుండా ఉన్న ఆ దృశ్యం గుండెలు అవిసిపోయేలా, అతి భయంకరంగా ఉంది.

భూమి ఓ నిర్మానుష్య జీవరహిత శిథిలం.

గుట్టలు గుట్టలుగా, దుమ్మూ ధూళీ పేరుకుపోయి ఉంది. దాని మీద గాలులు వీస్తూ ధూళిని రేపుతున్నాయి. మహానగరాలు శిథిలాలైపోయి ఉన్నాయి.



భూమి గుండె మీద గుచ్చిన మేకుల్లా స్కై స్క్రేపర్స్ ఆకాశం వేపుకి అసహాయంగా తలలెత్తి నిలబడి ఉన్నాయి. సముద్రాలు నీలిపొరలతో, నురగ తెట్టులతో, అలలతో, చెలియలికట్టలతో ఆటలాడే పరిస్థితిలో లేవు. మరణించిన జల రాసులవి. వాటి ఉపరితలం మీద రసాయనిక మలినాలు, నల్లటి కార్బన్ కెమికల్స్, చిక్కటి దట్టపు ఆయిల్ స్లిక్స్... వీటితో మందమైన తుట్టె కట్టి నీరు అసలు కనిపించడం లేదు. ఈ పరిస్థితిలో ఆ నీటిలో ఏ జీవీ బ్రతికి ఉండే అవకాశం లేదు. వీస్తున్న గాలుల నిండా యాసిడ్ పొగలు... అంతటా రేడియేషన్ పరుచుకొని ఉంది. వారు స్పేస్ కాబ్‌లో గ్రహం చుట్టూ తిరిగారు.

డాక్టర్ విశ్వాస్‌కి ఈ దృశ్యం చూసేసరికి ఏదో జరిగింది. తనలో తానే మాట్లాడుకోవడం మొదలుపెట్టాడు పరధ్యానంగా... గొణుక్కుంటున్నట్లుగా. "అదిగో అది ఆఫ్రికా... అక్కడే సెరెంగెట్ పార్క్ ఉండేది. ఆపైన చారలా ఉన్నది నైల్ నది. ఇక్కడ పిరమిడ్స్ ఇంకా ఉన్నాయి. దుమ్ములో మునిగి, అరిగిపోయి దెబ్బలు తిని ఉన్నాయి. అదిగో అది గ్రేట్ పిరమిడ్ ఆఫ్ ఛియోప్స్. వేలాది ఏళ్ళనాడు ఓ ప్రాచీన నాగరికతలో... ఆ ప్రజలు నిర్మించిన కాలనాళికల్లాంటివి. ఈ పిరమిడ్స్ మానవ ఔన్నత్యానికీ, మొండితనానికీ, తెలివి మాలినతనానికీ చిహ్నాలు... అదిగో అది న్యూయార్క్. హైరైజ్ బిల్డింగ్స్... అన్నీ మేకుల్లా ఎలా నిలబడి ఉన్నాయో! ఇదిగో ఇది ఢిల్లీ... ఇక్కడ అశోకా పిల్లర్ ఇంకా నిలబడే ఉంది. ఆశ్చర్యం. ఈ కాలుష్య ప్రభావం దానిమీద లేదు. బూడిద రంగు వెలుగులో డల్‌గా కనబడుతోంది... టాజ్... తాజ్ మహాల్... ఏదీ? యాసిడ్ గాలులలో కరిగిపోయింది. మంచులాంటి పాలరాయితో కట్టిన మధుర స్వప్నంలాంటి ఆ సుందర భవనం ఎలా నిలబడగలుగుతుంది! ఈ విధ్వంసం దారుణం.. ఓ స్పేస్! ఇక్కడ ఏం జరిగింది?

అప్పుడు డాక్టర్ విశ్వాస్ నిశ్శబ్దంగా రోదించడం మొదలుపెట్టాడు. అంత డిగ్నిఫైడ్ పెద్ద మనిషిని ఆ స్థితిలో చూడడానికి కెప్టెన్ ఇబ్బంది ఫీలయ్యాడు.

"ప్లీజ్ డాక్టర్. టేకిట్ ఈజీ. బహుశా ఇక్కడేమైనా యుద్ధం జరిగిందా? ఏవో ఘర్షణల్లో ఈ వినాశం సంభవించి ఉండవచ్చా? డాక్టర్. మీరు సమాధానం చెప్పాలి... డాక్టర్... ప్లీజ్."

డాక్టర్ విశ్వాస్ కొన్ని నిమిషాలు తమాయించుకుని జీరనిండిన గొంతుకతో, తనలో తాను అనుకుంటున్నట్లుగా అన్నాడు:

"బహుశా నీవు చెప్పినట్లుగానే ఇక్కడ యుద్ధం జరిగిందేమో కెప్టెన్. భూమి మీద ఎన్నో రకాల నమ్మకాలుండేవి. వాటివల్ల వారిలో ఎన్నో విభజనలు. ఎవరికి వారు తామే అధికులమనీ, ఆధునికులమనీ, దైవసాన్నిధ్యాన్ని అవలీలగా సాధించగల సామర్థ్యం ఉన్నవారమనీ భావించేవారు. ఎవరి నమ్మకాలు వారిని పూర్తిగా గుడ్డివాళ్ళని చేశాక, ఎవరి పరిధిలో వారు గిరిగీసుకుని కూర్చుండి పోయేవారు. అదృష్ట వశాత్తు రోదసి దిశగా చూపు నిలిపి, టెక్నాలజీ మీద దృష్టితో, శాస్త్రీయ విధానాలతో సాధనసంపత్తులను కనుగొని, గాలక్సీ దిశగా పోయారు. బిగాట్స్ భూమి మీదే ఉండిపోయారు. వారి మూఢ నమ్మకాలతో సహా బహుశా వారి పనే అయిఉండాలి ఈ వినాశనం. ఈ అందమైన గ్రహం మళ్ళీ అడవుల పచ్చదనం సంతరించుకోదేమో... పక్షుల కిలకిలారావాలు ఇక్కడ వినిపించవేమో... ఈ గ్రహోపరితలం మీద ఓ గడ్డిపరకైనా మొలుస్తుందో మొలవదో సందేహమే. ఇక ఏ ప్రాణీ ఈ మృత గ్రహపు పొరల్లోంచీ, దారుణంగా పొల్యూట్ అయిన సముద్ర గర్భం నుండి జీవం పోసుకుని పరిణామక్రమంలో అడుగిడక పోవచ్చు. మానవులు ఎంత మూర్ఖులు! యుద్ధాలతో, దౌర్జన్యాలతో, తమ మాటలు నెగ్గించుకోవాలన్న దుగ్ధతో, ఏవో సామాన్య ఆర్థిక కారణాల వల్ల, వారు చేసిన ప్రయత్నాల వల్ల ఈ గ్రహ చరిత్రలో ఏనాడూ శాంతి లేదు. తమ సుదీర్ఘ చరిత్రలో వారు ఏనాడూ సరైన నిర్ణయాలు తీసుకోలేదు. నిజమైన స్వర్ణయుగం వారు ఎరుగరు. అది సాధ్యమైనది రోదసీ యుగంలో మాత్రమే. సైన్స్ ఏజ్! స్పేస్ ఏజ్! మానవ కల్యాణానికి ఉద్దేశించిన సైన్స్‌ని వారు తమ వినాశానికే వాడుకున్నారు. ప్రతి ఇన్వెన్షన్‌నీ వారు మారణ హోమానికి వాడి తమ వినాశానికి తామే కారకులయ్యారు. వెళ్ళిపోయిన మానవులు సురక్షితంగా, గాలక్సీలో స్వేచ్ఛగా, సుఖంగా ఇతర జీవుల సాన్నిహిత్యంలో, సాహచర్యంలో బ్రతుకుతున్నారు. థ్యాంక్ గాలక్సీ ఫర్ దట్."

చల్లటి గాలి వీస్తోంది. గాలిలో భరించరాని

దుర్గంధ వాయువులు. టాక్సిక్ గాసెస్. కెప్టెన్ అన్నాడు. "డాక్టర్ విశ్వాస్ మరి వెళదామా?" "యస్ కెప్టెన్. మీరు వెళ్ళవచ్చు."

"అంటే మీరు ఇక్కడే ఉండిపోవాలని మీ ఉద్దేశమా డాక్టర్. ఈ మృత గ్రహం మీద ఎలా ఉండగలరు?" "ఉండక తప్పదు." "ఒంటరిగా మీరు ఇక్కడ ఎలా బ్రతకగలరు డాక్టర్?"

"ఒంటరితనం నాకు అలవాటే కెప్టెన్. ఎలాగో బ్రతకడానికి ప్రయత్నం చేస్తాను. గత వందలాది ఏళ్ళుగా ఎలా బ్రతుకుతున్నాననుకున్నావు? ఒంటరితనం నా ఎగ్జిస్టెన్షియల్ రియాలిటీ...నా మనసు ఆలోచనలతో, ఫిలసాఫికల్ ప్రశ్నలతో, గణిత సంబంధిత ప్రశ్నల వలయాలతో నిండి పోయి ఉంటుంది. నాకు నిజంగా ఒంటరితనం లేదు. నన్ను ఈ విశ్వం ఆవహిస్తుంది. నా మనసు ఏకాకిగా... ఓ సెపరేట్ లాబ్‌గా పనిచేయడం నాకు మామూలే... ఎన్నో ఏళ్ళ తర్ఫీదు ఫలితం ఇది." "మీకెవ్వరూ లేరా డాక్టర్?"

"ఉండేవారు కెప్టెన్. మనుమరాలు... ఆమె భర్త... వారి పిల్లలు... నా భార్య ఏనాడో చనిపోయింది. నా వాళ్ల సంతతి గాలక్సీలో ఎక్కడో ఉండే ఉంటారు. సెంటార్‌కి వెళ్ళిన మొదటి షిప్‌లోని ప్రయాణీకులు వాళ్లు కెప్టెన్."

**ఇంకా మానవ జాతికి లాస్ట్ ఛాన్స్ ఉంది. చేస్తాను. చేయక తప్పదు అనుకున్నాడు డాక్టర్ విశ్వాస్.**

ఎక్కడున్నావు టురాక్? ఎక్కడున్నావు రియా మై డార్లింగ్? ఎక్కడున్నారు మీరు రోహన్, జీనా? మీరంతా ఎక్కడున్నారు? ఎక్కడికి వెళ్ళి పోయారు? ప్రశ్నల మథనంతో కళవళపడుతుండగా డాక్టర్ విశ్వాస్ ఆకాశం వంక చూశాడు. బూడిదరంగు మేఘాలతో నిండిన ఆకాశంలో జవం లేదు... జీవం లేదు. ప్రళయానంతరపు శ్మశానంలా, నిశ్శబ్ద నాటక రంగంలా, అమినస్‌గా... భీతి గొలుపుతూ ఉంది... అక్కడక్కడ మినుకు మినుకు మంటూ తారామండలాలు.



చల్లటి గాలి వీస్తూనే ఉంది ఒళ్ళు జలదరించేలా. "ఇక్కడ ఎలా బ్రతకగలరు డాక్టర్?"

"నేను మానవుణ్ణి కెప్టెన్. గతాన్ని మళ్ళీ పునరావృత్తం చేయాలని ప్రయత్నం చేయడంలో తప్పులేదు కదూ?" "ప్రయత్నమా? దేనికి?"

"భూమిని మళ్లీ పాత రోజులు తలపించేలా తయారుచేయడానికి."

ఇప్పుడు కెప్టెన్‌కి బాగా అర్థమయింది డాక్టర్ మానసిక పరిస్థితి. దిస్ మాన్ ఈజ్ క్రేజీ! ఇన్‌సేన్! పూర్ డాక్టర్ విశ్వాస్. ఈ గ్రహ పరిస్థితి చూసి అతడికి మానసికంగా పెద్ద దెబ్బ తగిలింది.

"అదే మీ నిర్ణయమైతే నేను మీ సెలవు తీసుకుంటాను డాక్టర్ విశ్వాస్." "గుడ్‌బై కెప్టెన్. మీకు నా ధన్యవాదాలు. ఆం- మరిచి పోయాను. మీరు ఈ డబ్బంతా తీసుకెళ్లాలి. ఇక్కడ డబ్బుకు అవసరం ఉండదు కెప్టెన్. ప్లీజ్, టేకిట్. సేవా. ఆ పెట్టె కాబ్‌లో పెట్టు."

కెప్టెన్ మిర్దాన్ డాక్టర్ విశ్వాస్ కళ్ళలోకి చూశాడు. వికలితమైనప్పటికీ ఆ కళ్ళలో ఏదో శక్తి ఉంది. పట్టుదల నిండిన దృఢ చిత్తం ఆ కళ్ళ వెనక ఉంది. డాక్టర్ విశ్వాస్‌తో కరచాలనం చేసి స్పేస్ కాబ్‌లోకి ఎక్కి కూచున్నాడు.

సేవా అన్నది. "గుడ్‌బై కెప్టెన్. నేను నా మాస్టర్‌తో ఇక్కడే ఉండిపోతాను. మమ్మల్ని ఇక్కడికి తీసుకు వచ్చినందుకు నా ధన్యవాదాలు."

"గుడ్‌బై సేవా. డాక్టర్ విశ్వాస్‌ని భద్రంగా చూసుకో. గుడ్‌బై డాక్టర్ విశ్వాస్."

స్పేస్ కాబ్ చల్లటి విషపూరిత గాలులలో పైకి లేచింది. చివరికి మెయిన్ షిప్‌తో డాకింగ్ అయింది: స్నేహా అన్నది. "కెప్టెన్! ఎంత భయంకరం! ఎంత ప్రమాదకరం!" "నాకు తెలుసు స్నేహా." "తెలిసి ఎందుకు ఊరుకున్నావు కెప్టెన్?" "అది డాక్టర్ విశ్వాస్ నిర్ణయం స్నేహా."

"అయినాసరే కెప్టెన్. మనకు తెలుసు, ఆ గాలిలో యాసిడ్ పాలు ఎక్కువ. రేడియేషన్ కూడా అత్యంత ప్రమాదకరమైన లెవెల్లో ఉంది. రెండు గంటల్లో లోహ భాగాలని యాసిడ్ తినివేసి రోబో ఫంక్షన్ చేయడం మానేస్తుంది. డాక్టర్ విశ్వాస్ ఒంట్లో కూడా లోహాలున్నాయి. ఆర్టిఫిషియల్ లింబ్స్... ప్లాస్టిక్ మెటీరియల్... ప్లాస్టిక్... పాసిట్రానిక్ మెటీరియల్... ఉన్నాయి. ఆ యాసిడ్ గాలులలో అతడు ఎక్కువ కాలం ఉండలేడు. వాళ్ళని మనతో తీసుకు రావలసింది కెప్టెన్. అక్కడ వదిలి రావడం బాధ్యతారాహిత్యంగా నేను భావిస్తున్నాను."

"అవన్నీ నాకూ తెలుసు స్నేహా. వారి నిర్ణయాలని మార్చడానికి మనమెవరం? జీవులకి ఉన్న ప్రథమ స్వేచ్ఛ స్వయం నిర్ణయాధికారం. అది వారికి ప్రకృతి నుండి సంక్రమించింది. సామాజిక న్యాయాలు నిర్వచించాయి. అది అత్యున్నత మైన స్వేచ్ఛ. దానితో నేను ఆటలాడలేను."

"మీ మనుషులు నాకు అర్థం కారు కెప్టెన్" అంది స్నేహా అనహాయంగా.

"ప్రయత్నం చేయకు స్నేహా. నీ డ్యూటీ నీవు చేయి. అంతే చాలు నాకు."

స్పేస్ షిప్ "క్షమ" గ్రహం దిశగా ప్రయాణం సాగింది.

"సేవా?" "యస్ డాక్టర్?" "ఇక్కడే ఓ వాల్ట్ ఉండాలి. స్కాన్‌తో లొకేట్ చేయి."

స్కానర్ ఆన్ చేసింది. "డాక్టర్, నా శరీరం పైభాగాన్ని యాసిడ్ తినివేస్తున్నది. ఇంకా లోపలి భాగాలకి ఆ ప్రమాదం రాలేదు."

"నాకు తెలుసు సేవా... నీవు ముందు వాల్ట్ మీద దృష్టి ఉంచు... నాలుగు అడుగుల లోతులో ఓ డోర్ ఉంటుంది అక్కడే..."

హిస మంటూ స్కానర్‌తో వాల్ట్ లొకేషన్ జరుగుతోంది. చివరికి ఆగింది. "డాక్టర్ ఇక్కడ ఉన్నట్లుగా ఉంది."

ఇద్దరూ ఆ స్పాట్‌కి వెళ్ళి చూశారు. నేలలో లోతుగా ఉన్న రహస్య మందిరం తాలూకు డోర్ ఉంది. పైన ఉన్న మట్టిని సేవా తన మెటల్ చేతులతో కొద్ది నిమిషాలలో తీసివేసింది.

డోర్ పైకి లాగి చూశారు. మెట్లు క్రిందికి దిగుతున్నాయి. లోపల చీకటి. మెట్లు దిగారు ఇద్దరూ.

"సేవా, ఇక్కడ జెనరేటర్ ఎక్కడ ఉందో చూడు."

"జెనరేటర్ ఆన్ అయే ఉంది డాక్టర్. ఎనర్జీ సేవ్ చేయడానికి లైట్లు ఆర్పి ఉన్నాయి. ఎయిర్ కండిషన్ ప్లాంట్ పని చేస్తూనే ఉంది."

లైట్స్ ఆన్ అయ్యాయి. డాక్టర్ విశ్వాస్ నవ్వాడు. హాపీగా, తనివి తీరా నవ్వాడు. అతడిలో టెన్షన్ లేదు. హి వజ్ ఎ న్యూ మాన్. అది ఓ పెద్ద ఎటామిక్ షెల్టర్. మందమైన మెటల్ గోడలతో... కొన్ని అడుగుల మందమైన మెటల్ కాంక్రీట్ రూఫ్‌తో, కొన్ని వందల గదుల నిండా ఉన్న భోజన పదార్థాలు... లక్షలాది లీటర్ల నీరు... రీసైకిలింగ్ యూనిట్స్... ఇవి కాకుండా సూపర్ కంప్యూటర్ బాంక్స్... కణాల బాంక్స్... అన్ని రకాల జీవుల కణాలూ అక్కడ భద్రపరచి ఉన్నాయి. జీన్ పూల్స్... జెనెటిక్ బాంక్స్... సెల్ బాంక్స్... మనుషులు... పక్షులు... చెట్లు... అన్ని స్పేసీస్ తాలూకు కణాలు భద్రంగా ఉన్నాయి. విజ్ఞాన సర్వస్వాల లైబ్రరీలు ఉన్నాయి. అది ఓ ట్రెజర్ హౌస్. దీనిని కొన్ని వందల మంది సైంటిస్టులు డాక్టర్ విశ్వాస్ సారథ్యంలో వందలాది ఏళ్ళనాడు నిర్మించారు. ఇక్కడ సాధన సంపత్తి ఉంది. కొన్ని వందల రోబోలను తయారు చేయగల అసెంబ్లీ యూనిట్స్ ఉన్నాయి. స్పేర్ పార్ట్స్ ఉన్నాయి. "తలుపు వేసిరా సేవా మనకు చాలా పని ఉంది."

స్విచ్‌లు అన్నీ వేశాడు డాక్టర్ విశ్వాస్. ఆ షెల్టర్ వెలుగుతో నిండిపోయింది. ఇంకా మానవ జాతికి లాస్ట్ ఛాన్స్ ఉంది. ఇక్కడ ప్రారంభమయే చరిత్ర మళ్ళీ గాలక్సీలకి చేరుకోవాలి. చేస్తాను. నేను చేస్తాను. చేయాలి. నేను చేయాలి. చేయక తప్పదు అనుకున్నాడు డాక్టర్ విశ్వాస్. "సేవా, నీవు రెడీ?"

"ఎస్ డాక్టర్" "మనం భూమిని మళ్ళీ నివాస యోగ్యంగా చేయాలి సేవా."

"అది సాధ్యమా డాక్టర్"

"నీవూ నేనూ కలిసి పని చేస్తే సాధ్యం కానిదేముంది సేవా. అన్నీ సాధ్యమే. నీవు చూస్తావుగా."

హుషారుగా ఈల వేస్తూ డాక్టర్ విశ్వాస్ కంప్యూటర్ బాంక్స్ కేసి నడిచాడు.